జీజీహెచ్‌లో అత్యాధునిక యంత్రం

- సీ ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్‌రే మెషీన్ కొనుగోలు
- వెన్నెపూస, ఎముకలు, గుండె సంబంధిత చికిత్సలకు అనుకూలం


సీ ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్‌రే మెషీన్‌తో వైద్య నిపుణులు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వెన్నెపూస, ఎముకలు, గుండె శస్త్ర చికిత్సలకు సంబంధించిన అత్యాధునిక వైద్య పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు మెడికల్ కళాశాలకు అనుసంధానంగా జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా వర్గోన్నతి చేసిన విషయం విదితమే. సర్వజన ఆసుపత్రికి నిధులు మంజూరు చేసి అత్యాధునిక వైద్యచికిత్స పరికరాలు, యంత్రాలను కొనుగోలు చేశారు. కానీ గత ఏడాది కాలంగా పనిచేసిన ఏలూరు జీజీహెచ్ వైద్య అధికారులు రోగులకు మెరుగైన వైద్య చికిత్సలపై దృష్టి సారించలేదనే విమర్శలు ఉన్నాయి.

నిత్యం 10 వరకు చికిత్సలు

సీ ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్‌రే మెషీన్ ఎముకలు, వెన్నుపూస శస్త్ర చికిత్సలకు ఉపయోగకరంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆపరేషన్ చేసే సమయంలోనే ఈ యంత్రంలో ఎముకల దృశ్యాలను చూస్తూ వాటిని సరిజేయవచ్చు. ప్రతి రోజూ సుమారుగా 5 నుంచి 10 మంది రోగులకు ఈ యంత్రం ద్వారా శస్త్ర చికిత్సలు చేసే అవకాశం ఉంది. ఈ మెషీన్‌తో కేత్ ల్యాబ్‌లో గుండె రక్త ప్రసరణ లోపాలను నిర్ధారించుకునే అవకాశం ఉంటుంది. యాంజియోగ్రామ్ పరీక్షలు, స్టంట్స్ వేసే సమయంలో రక్తనాళాల్లో అడ్డంకులు గుర్తించి వాటిని తొలగించేందుకు ఉపయోగపడుతుంది. గ్యాంగ్రీన్, సిరల్లో త్రోంబోసిస్‌తో బాధపడే రోగులకు, పేగులు, అన్నవాహిక, క్లోమగ్రంథి పరీక్షలకు ఈ మెషీన్‌ను వినియోగిస్తారు.

రూ.40 లక్షలతో కొనుగోలు



సీ ఆర్మ్ ఫ్లోరోస్కోప్ ఎక్స్‌రే మెషీన్‌ను రూ.40 లక్షలతో కొనుగోలు చేశాం. జీజీహెచ్‌లో ఇలాంటి వైద్య సేవలు ఉండడం వల్ల పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇటీవల పుట్టిన బిడ్డల్లో ఏర్పడే వంకర పాదాల వ్యాధికి సైతం చికిత్స అందిస్తున్నాం. భవిష్యత్‌లో మరింత మెరుగైన వైద్యసేవలు, శస్త్రచికిత్సలు అందుబాటులోకి వస్తాయి. గతంలో ఉన్న యంత్రం మరమ్మతులకు గురైంది.

– ఎంఎస్ రాజు, ఏలూరు జీజీహెచ్ అదనపు వైద్య సంచాలకులు

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించండి


రవాణా అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని చింతలపూడి నుంచి వయా కాంతంపాలెం, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం, గణిజర్ల మీదుగా రాఘవపురానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్‌కు, ఏలూరు డిపో సూపరింటెండెంట్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ రూట్‌లో బస్సు సర్వీసు లేక ప్రజలు, విద్యార్థులు, వాణిజ్య, కూరగాయల పంటల రవాణాకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై డీపీటీఓ స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, మార్చి ఎనిమిది తర్వాత బస్సు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. నాయకుల మన్నవ కృష్ణ చైతన్య, తోర్లపాటి బాబు, బండి వెంకటేశ్వరరావు, చేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గాదంశెట్టి శ్రీనివాసరావు, పురం రామ వెంకట సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో సీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గణపతి సచ్చిదానంత నారాయణీయం ఆధ్వర్యంలో మినీ నారాయణీయం, కైకలూరుకు చెందిన ఘంటసాల బసవయ్య బృందం ఘంటసాల భక్తి రంజని పేరిట సంగీత కచేరి నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడిలో సీతారామ నగర్‌లో మహాగణపతి, సీతా రామచంద్రస్వామి, కనకదుర్గమ్మ వార్ల మూల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు ఆలయ ప్రధాన అర్చకుడు దేవరకొండ శ్రీనివాసరావు, రుత్వికులు ఆధ్వర్యంలో చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యహ వాచనం, పంచ గవ్య ప్రాశన, మండప పూజలు, హోమాలు నిర్వహించారు.

నేడు మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ సొసైటీ సమావేశం

ఏలూరు టౌన్: ది మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరులోని సొసైటీ నూతన కార్యాలయంలో నిర్వహిస్తామని సొసైటీ అధ్యక్షుడు వడ్డీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యధిక శాతం మార్కులతో ఉత్తీర్ణులైన సంఘం సభ్యుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని సంఘం కార్యదర్శి నెరుసు వెంకట రామారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్లు ఎం మహిధర్, ఎం లీలరాణి, ఆర్.బాలకృష్ణ, పి.సూర్యవతి తదితరులు ఉన్నారు.

మంచినీటి చెరువు పరిశీలన

ఏలూరు (టూటౌన్): రాబోయే వేసవిలో నగర ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకుండా తీసుకునే చర్యల్లో భాగంగా దెందులూరులో ఉన్న గోదావరి జలాల చెరువును నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ శనివారం పరిశీలించారు. చెరువు వద్ద గోదావరి కాలువ ద్వారా వస్తున్న నీరు, పంపింగ్ మోటార్ల పనితీరును పర్యవేక్షించారు. ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

● సేమ్ టు సేమ్



సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని చెబుతుంటారు. ఒకే రూపం గల ఇద్దరు ఒకే ఇంటిలో ఉంటే అది ఒక గొప్ప అనుభూతిని ఇస్తుంది. కవలల అల్లరిని ఆస్వాదిస్తూ కంటిపాపలా కాపాడుకుంటూ, వారికి ఒకే రకం దుస్తులు, బొమ్మలు ఇస్తూ తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. శనివారం కవలల దినోత్సవం సందర్భంగా స్థానిక రామచంద్రరావు పేట శ్రీ శర్వాణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మిఠాయిలు తినిపించుకుంటున్న కవలల దృశ్యమిది.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

నేటి నుంచి జీవన వికాస ఉచిత శిక్షణ


జీవన వికాస శిక్షణ కరపత్రం విడుదల చేసిన సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వామి మైత్రేయ జీవన వికాస ఉచిత శిక్షణ తరగతులు స్థానిక ప్రేమాలయం అనుబంధ సంస్థ సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మార్చి ఐదో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కరపత్రాన్ని శనివారం ఏలూరు గో సంరక్షణ సమితిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాచీన భారతీయ ఆధ్యాత్మిక, యోగ, ధ్యానం గురు స్వామి మైత్రేయ విలేకర్లతో మాట్లాడారు. మన నిత్య జీవితంలో ధ్యానం చాలా ప్రాధాన్యమైనదని తెలిపారు. ధ్యాన సాధన ద్వారా సహనం, కరుణ వంటి గుణాలు అలవడతాయని చెప్పారు. ప్రేమాలయం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పీఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని, ఇక్కడ నిత్యం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ కాన్ఫరెన్స్ హాలులో నిత్యం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ ఉచిత అవకాశాన్ని ఆరోగ్యాభిలాషులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రేమాలయం కమిటీ జాయింట్ సెక్రటరీ ఆలపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.లక్ష్మి, బీవీ సుబ్రహ్మణ్యం, ఎక్సిక్యూటివ్ మెంబర్స్ గొర్ల రామారావు, కూచిపూడి సత్యనారాయణ, తిమ్మన కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వ్యక్తుల మధ్య అసమానతకు ప్రాధాన్యత అవసరం లేదని ఏలూరు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.మంగా కుమారి అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో శనివారం కళాశాల 36వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంగాకుమారి మాట్లాడుతూ సమస్యలకు సరైన పరిష్కారం సూచించుకోవాలని, చట్టాలను దుర్వినియోగం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణా రావు మాట్లాడుతూ లక్ష్యసాధనలో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ జి.సరళ కళాశాల వార్షిక నివేదిక వినిపించారు. వివిధ అంశాలలో ప్రతిభ కనపంచిన విద్యార్థినులకు మంగా కుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళా కళాశాల కరెస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ పి.శ్రీరంగం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పని చేస్తున్న సంస్థల ద్వారా జీతాలు ఇవ్వాలి


మస్టర్ సమయంలో ప్రసారం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): నగరపాలక, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి పనిచేస్తున్న సంస్థల ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కోట దెబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద మస్టర్ సమయంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్ సంస్థను రద్దుచేసి ప్రైవేటు వ్యక్తులను కాంట్రాక్టర్లుగా నియమించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న ఐదుగురుని రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల బకాయి డీఏలు, మూడేళ్ల సరెండర్ లీవులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	14	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	24	బీన్స్ చిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	16	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	72
కాకర కాయలు	34	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	36	కీరా దోస	42
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	14	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	10
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	14
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	05
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

డ్రైవర్ తప్పిదమే కారణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో రెండో నెంబర్ ప్లాట్ ఫాంపైకి ఈ నెల 21వ తేదీన ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లిన ఘటనకు డ్రైవర్ తప్పిదమే కారణమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన ఘనటపై తమ సాంకేతిక బృందం క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహనంలో ఎటువంటి యాంత్రిక సమస్యలూ లేవని, బ్రేకులు కూడా సరిగ్గానే పని చేస్తున్నాయని గుర్తించినట్టు చెప్పారు. ఈ ఘటనకు బస్సు డ్రైవరే పూర్తిగా బాధ్యుడని వివరించారు.

24న ఎస్సీల ఐక్యతా సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 24న ఎస్సీ ఐక్యతా సదస్సు నిర్వహిస్తున్నట్లు నవ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి తెలిపారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వసంతమహల్ సెంటరులోని జాబిల్లి కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 11 గంటలకు సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, రాష్ట్ర ఫారెస్ట్ మాజీ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలపై సర్వే


క్యాన్సర్ లక్షణాలపై సర్వే చేస్తున్న డాక్టర్, సిబ్బంది

దెందులూరు: 18 ఏళ్ల నిండిన మహిళలందరూ విధిగా స్క్రీనింగ్ టెస్ట్‌లు చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. శనివారం క్యాన్సర్ లక్షణాలపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. బీపీ, సుగర్, క్యాన్సర్, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులకు సంబంధించి లక్షణాలు గుర్తించిన వెంటనే సమీప పీహెచ్‌ఎల్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వారికి పూర్తి వివరాలు తెలియజేసి సహకరించాలని వైద్యులు సూచించారు. ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నగరంపై డ్రోన్లతో నిఘా

ఏలూరు టౌన్: బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఏలూరు నగరంలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల వద్ద అభయ టీమ్ రక్షణగా నిలుస్తోంది. తాజాగా ఏలూరులో డ్రోన్ కెమెరాలు ద్వారా విద్యార్థినులు కళాశాలల నుంచి హాస్టళ్లకు వెళ్లే ప్రాంతాల్లో నిఘా పెట్టారు. డ్రోన్ కెమెరాల వినియోగంతో ఏలూరు పోలీసులు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. విద్యా సంస్థల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, విద్యార్థినులను ఆకతాయిలు వేధించినా వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 112 లేదా సెల్ నెంబర్ 95503 51100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ తెలిపారు. డీఎస్పీ పర్యవేక్షణలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ క్రాంతిప్రియ, టెక్నికల్ బృందం ఏలూరు నగరంలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.


డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు


ఏలూరులో విద్యార్థినులు వెళ్లే ప్రాంతంలో డ్రోన్ల పర్యవేక్షణ

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

దెందులూరు : అంకితభావంతో పని చేస్తే ఏ రంగంలోనైనా గుర్తింపు వస్తుందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న దెందులూరు నియోజకవర్గ గ్రిక్ స్పోర్ట్స్ గేమ్స్ ముగిశాయి. విజేతలకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల సురేష్ కుమార్, గవ్వ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

విజేతల వివరాలు

బాలుర విభాగంలో కబడ్డీలో విజేతగా మాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా పోతునూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది. కోకోలో అప్పనవీడు జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలుగా, పోతునూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో కొవ్వలి జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలుగా, గుడివాకలంక జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. త్రోబాల్‌లో విజేతగా కొప్పాక జెడ్పీహెచ్ఎస్ జట్టు, రామసింగవరం జెడ్పీహెచ్ఎస్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

బాలికల విజేతలు: వాలీబాల్‌లో విజేతలుగా మేధినరావుపాలెం జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా చాటపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది. త్రోబాల్‌లో విజేతలుగా కొప్పాక జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా రామశింగవరం జెడ్పీహెచ్ఎస్ జట్టు విజేతలు నిలిచింది. కబడ్డీలో విజేతలుగా కలపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నరర్స్‌గా వీరమ్మకుంట జెడ్పీహెచ్ఎస్ జట్టు, ఖోఖోలో విజేతలుగా వంగూరు జెడ్పీహెచ్ఎస్ జట్టు, రన్నర్స్‌గా కలపర్రు జెడ్పీహెచ్ఎస్ జట్టు నిలిచింది. విజేతలను ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు.

బుక్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

దెందులూరు: గోపన్నపాలెంలో గ్రంథాలయం ఏర్పాటు మెట్ట గ్రామాల్లో డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు చదువులు కోరుతున్నారు. గోపన్నపాలెంలో 10 గ్రామాలకు సెంటర్‌గా ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి దాత స్థలం భవనం ఇచ్చి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఏదొక కారణాలవల్ల భవనం శిథిలావస్థకు చేరి పుస్తకాలు, పేపర్లు తడిచిపోయి గోపన్నపాలెం గ్రంథాలయాన్ని తీసివేశారు. మెట్ట గ్రామాల్లో సెంటర్‌గా ఉన్న రామారావుగూడెంలో డిపాజిట్ సెంటర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ కథకు నేడు కిందట ఏర్పాటు చేసింది. మరి ఎందుకు ఆ బుక్ డిపాజిట్ సెంటర్ సైతం రద్దు చేసింది. రామారావుగూడెంలో ఒక గ్రామంలోనైనా డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఏడు నుంచి ఎనిమిది గ్రామాల ప్రజలకు పత్రికలు, పుస్తకాలు రోజు చదువుకునే వెసులుబాటు కలుగుతుందని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీఎల్, బీఈడీ, టీటీసీ, నర్సింగ్ ల్యాబ్ ఇలా వేలాది మంది విద్యనభ్యసించి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు గ్రంథాలయ సౌకర్యం లేక తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. గోపన్నపాలెంలో గ్రంథాలయం రామారావు గూడెంలో బుక్స్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం


మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సునీల్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ గ్రామ, పట్టణ ప్రాంతాల్లో మరింత బలోపేతం అవుతోందని రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు అన్నారు. శనివారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో పరిస్థితులను, పార్టీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల నమోదు తదితర అంశాలను వివరించారు.